# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 18-07-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు కృష్ణా జిల్లాలో నిర్వహించే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు.**

2. **కవి అందెశ్రీ జయంతి సందర్భంగా మేడ్చల్- మల్కాజ్గిరి జిల్లాలో నిర్వహించనున్న కార్యక్రమానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరుకానున్నారు.**

3. **కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమంతో పాటు భారీ పెట్టుబడులను ఆకర్షిస్తూ ఉపాధి అవకాశాలు కల్పిస్తోందని ఆంధ్రప్రదేశ్ కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు.**

4. **ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి తెలిపారు.**

==========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు కృష్ణా జిల్లాలో పర్యటించనున్నారు. ఈ ఉదయం గుడివాడ పట్టణంలో నిర్వహించే స్వర్ణాంధ్ర -- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో, ప్రజావేదిక సమావేశంలో ఆయన పాల్గొంటారని అధికారులు తెలిపారు. అనంతరం పాఠశాల విద్యార్థులతో ముఖాముఖి నిర్వహిస్తారు. మధ్యాహ్నం యలవర్తి గ్రౌండ్స్‌లో టిడిపి స్థానిక నాయకులు, కార్యకర్తలతో సమావేశమవుతారని అధికారులు వెల్లడించారు.

--------------------------

తెలంగాణ భాషా వైభవానికి ప్రతీకగా నిలిచిన కవి అందెశ్రీ జయంతి సందర్భంగా మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఘట్‌కేసర్‌లో ఈ రోజు నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరుకానున్నారు. 3 కోట్ల 95 లక్షల రూపాయలతో నిర్మించనున్న అందెశ్రీ స్మృతి వనానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. అందెశ్రీ సాహిత్య వారసత్వాన్ని భావితరాలకు అందించడంతో పాటు తెలంగాణ భాష, సంస్కృతి, సాహిత్య వైభవాన్ని ప్రతిబింబించే కేంద్రంగా ఈ స్మృతి వనాన్ని రూపొందించాలని ప్రభుత్వం భావిస్తోంది.

--------------------------

ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితులపై తెలంగాణ మంత్రివర్గం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. హైదరాబాదులోని సచివాలయంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధ్యక్షతన నిన్న నిర్వహించిన మంత్రివర్గ సమావేశంలో రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితిని అధ్యయనం చేసి, నష్టాన్ని అంచనా వేయడానికి

కేంద్ర బృందాన్ని పంపాలన్న ప్రతిపాదనకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రత్యామ్నాయ ప్రణాళికల అమలుకు అవసరమైన ఆర్థిక సహాయం అందించాలని కోరుతూ కేంద్రానికి లేఖ రాయాలని మంత్రివర్గం తీర్మానించింది. మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాలను మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌లతో కలిసి సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాత్రికేయుల సమావేశంలో వెల్లడిస్తూ.. వర్షాభావ పరిస్థితుల్లో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, సాగునీరు, విద్యుత్ సరఫరాపై తీసుకోవాల్సిన చర్యలపై మంత్రివర్గం సుదీర్ఘంగా చర్చించిందని తెలిపారు.

---------------------------

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి తెలిపారు. ప్రకాశం జిల్లా ఒంగోలులోని సాంఘిక సంక్షేమ వసతి గృహం విద్యార్థులకు అవసరమైన వస్తువులతో కూడిన కిట్లను మంత్రి నిన్న పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...

వాయిస్...30 సెకన్లు

---------------------------

రొయ్యల మేత తయారికి అవసరమైన ముడి పదార్థాల ధరలను నియంత్రించేందుకు కేంద్రం విధానపరమైన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరారు. గుంటూరు జిల్లాలోని ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో కేంద్ర మంత్రితో నిన్న సమావేశమైన ఆయన రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలను ప్రస్తావించారు. 100 కోట్ల రూపాయల కార్పస్ ఫండ్‌తో ఆంధ్రప్రదేశ్ రొయ్యల ఉత్పత్తిదారుల సమన్వయ కమిటీ ఏర్పాటుకు మద్దతు ఇవ్వాలని కోరారు. పొగాకు ఉత్పత్తులపై పన్ను భారం తగ్గించి రైతులను తక్షణం ఆదుకోవాలని, రాయలసీమ సమగ్ర ఉద్యాన పంటల అభివృద్ధి ప్రణాళిక కు కేంద్ర సహకారం అందించాలని కోరారు. అలాగే రిలయన్స్ భాగస్వామ్యంతో ఏర్పాటు చేయనున్న ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

---------------------------

కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమంతో పాటు భారీ పెట్టుబడులను ఆకర్షిస్తూ ఉపాధి అవకాశాలు కల్పిస్తోందని ఆంధ్రప్రదేశ్ కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలో 14 కోట్ల 14 లక్షల రూపాయల విలువైన వివిధ అభివృద్ధి పనులకు ఆయన నిన్న శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...

వాయిస్...30 సెకన్లు

---------------------------

నదుల అనుసంధానం, పూర్వోదయ ప్రాజెక్టు, రొయ్యల మేత ధరల తగ్గింపు వంటి అంశాలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు టిడిపి పార్లమెంట్ సభ్యులకు స్పష్టం చేశారు. గుంటూరు జిల్లా ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ సమావేశం నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా పార్లమెంట్ వర్షాకాల సమావేశాల అజెండాపై ముఖ్యమంత్రి పార్టీ ఎంపీలకు

దిశానిర్దేశం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఏకీకృత ఉన్నత విద్య నియంత్రణ సంస్థ ఏర్పాటుకు సంబంధించిన 'వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ బిల్లు'పై సమగ్ర అధ్యయనం చేసి పార్లమెంట్‌లో చర్చించాలని సూచించారు. నియోజకవర్గాల పునర్విభజన బిల్లు, మహిళా రిజర్వేషన్లు, ఆర్థిక, వ్యవసాయ విధానాలు, ఇథనాల్ మిశ్రమ పెట్రోల్ వినియోగం, వివిధ ప్రాజెక్టులకు నిధుల కేటాయింపు వంటి అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్ సాంప్రదాయ హస్తకళలు, చేనేత వారసత్వాన్ని ప్రపంచ స్థాయిలో ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత పేర్కొన్నారు. న్యూఢిల్లీలోని బాబా ఖరగ్ సింగ్ మార్గ్‌లో ఆధునీకరించిన 'లేపాక్షి' హస్తకళల ఎంపోరియంను ఆమె నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో హస్తకళలు, చేనేత రంగాల అభివృద్ధికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 16 లేపాక్షి దుకాణాలతోపాటు హైదరాబాద్, కోల్‌కతా, న్యూఢిల్లీల్లో సంస్థ దుకాణాలను నిర్వహిస్తూ వేలాది మంది కళాకారులకు మార్కెట్ అవకాశాలు, స్థిరమైన జీవనోపాధి కల్పిస్తోందని చెప్పారు.

-------------------------

దేశీయంగా యూరియా కొరతను పూర్తిగా అధిగమించి, విదేశీ దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించే లక్ష్యంతో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం 'యూరియా కోసం జాతీయ పెట్టుబడి విధానం–ఎన్ఐపియుకి ఆమోదం తెలిపిందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు. ఈ విధానంతో దేశంలో గ్యాస్ ఆధారిత యూరియా తయారీ యూనిట్ల ఏర్పాటును వేగవంతం చేసి, ఎరువుల రంగంలో భారీ పెట్టుబడులను ఆకర్షించనున్నట్లు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా వెల్లడించారు. కొత్తగా ఏర్పాటు చేసే ప్లాంట్లలో పర్యావరణహితమైన, అత్యాధునిక గ్యాస్ ఆధారిత సాంకేతికత వినియోగాన్ని ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. దీని వల్ల యూరియా కొరత లేకుండా రైతులకు సకాలంలో నాణ్యమైన ఎరువులు అందుబాటులో ఉంటాయని చెప్పారు.

-------------------------

తమిళనాడు, దక్షిణ అంతర కర్ణాటక, ఉత్తర కేరళ మీదుగా నైరుతి బంగాళాఖాతం నుండి ఉత్తర లక్షద్వీప్ వరకు ద్రోణి విస్తరించి ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్, యానంలలో దిగువ ట్రోపో ఆవరణములో నైరుతి, పశ్చిమ దిశగా గాలులు వీస్తున్నాయని వాతావరణ కేంద్ర అధికారిణి జి. లక్ష్మి పేర్కొన్నారు. వీటి ఫలితంగా ఉత్తర కోస్తా, యానాం, దక్షిణ కోస్తాల్లో ఈ రోజు తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముందని ఆమె వెల్లడిస్తూ..

వాయిస్...27 సెకన్లు

మరోవైపు తెలంగాణలో రానున్న రెండు రోజుల పాటు తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

=====================